

పిటిషన్ కమిటీ చైర్మన్‌గా కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర శాసనసభలో పిటిషన్ కమిటీ చైర్మన్‌గా శాసనసభ ఉప సభాపతి, కోలగట్ల వీరభద్ర స్వామి నియమితులయ్యారు. రాష్ట్ర శాసనసభలో పలు కమిటీలతో పాటు, శాసనసభ - శాసనమండలి సభ్యులతో కూడిన సంయుక్త కమిటీలను 2023-24 సంవత్సరానికి గానూ ఇటీవల ప్రకటించారు. ఆ మేరకు పిటిషన్ కమిటీ చైర్మన్‌గా కోలగట్లను నియమించారు. ఈ కమిటీలో సిహెచ్ రామచంద్రారెడ్డి, వసంత వెంకట కృష్ణ ప్రసాద్, కాసు మహేష్ రెడ్డి, ఆదిమూలం కొనేటి, అన్నం రెడ్డి అదీప్ రాజు, డాక్టర్ సిద్ధం రామానాయుడులను సభ్యులుగా నియమిస్తూ అసెంబ్లీ సెక్రటరీ జనరల్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేస్తున్న సిఐటియు నాయకులు, మహిళలు

మణిపూర్ అమానవీయ ఘటనలపై

మోడీ మౌనం వీడాలి

- కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన
- అత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి
- సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మణిపూర్‌లో జరిగిన అమానవీయ ఘటనలపై మోడీమౌనం వీడాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం నగరంలో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ దేశం తలదించుకునే విధంగా దేశంలో బిజెపి పాలన సాగుతోందన్నారు. కొన్ని నెలలుగా మణిపూర్ రాష్ట్రంలో అల్లర్లు జరుగుతున్నా కనీసం వాటిని నియంత్రించే పని మోడీగాని, అక్కడున్న బిజెపి రాష్ట్ర ప్రభుత్వం గాని చర్యలు తీసుకోవడం లేదన్నారు. అందువల్లే మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయన్నారు. అత్యంత దారుణంగా మహిళలను నగ్నంగా ఊరేగించి, వారిపై అత్యాచారం చేసి, హత్య చేయడం అక్కడి బిజెపి ప్రభుత్వ పాలనకు నిదర్శనమని అన్నారు. దేశంలో మోడీ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. అత్యంత పాశవికమైన చర్య పట్ల మోడీ నోరు మెదపకపోవడం దారుణమన్నారు. వెంటనే మణిపూర్ రాష్ట్ర ముఖ్యమంత్రిని పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు స్పందిస్తే తప్ప ప్రభుత్వాలు కళ్లు తెరవకపోవడం మహిళల పట్ల బిజెపి పాలకులకున్న చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. వెంటనే మణిపూర్ ఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని, దేశ ప్రజలకు మోడీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వి.లక్ష్మి, బి.సుధారాణి, టివి రమణ, ఎ.జగన్మోహన్, బి.రమణ, బి.పైడిరాజు, ఎస్.అనసూయ, త్రినాధరావు, కుమారి, రమ, గురుమూర్తి, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమానవీయ ఘటనకు కేంద్రం నిర్లక్ష్యమే కారణం

మణిపూర్‌లో గత కొన్నిరోజులుగా మతపరమైన ఘర్షణలు జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని, ఫలితంగా మణిపూర్‌లో ఇద్దరు మహిళలపై సామూహిక అత్యాచారం చేసి వారిని నగ్నంగా ఊరేగించిన అమానవీయ ఘటనకు కేంద్ర నిర్లక్ష్యమే కారణమని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ అన్నారు. మణిపూర్ అమానవీయ ఘటనకు నిరసనగా శుక్రవారం నగరంలోని రామకృష్ణ నగర్ నుంచి రాజీవ్ నగర్ కాలనీ వరకు ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా రమణమ్మ మాట్లాడుతూ బిజెపి పాలిత రాష్ట్రాల్లో మహిళలపై అత్యాచారాలు, అమానవీయ ఘటనలు పెరిగిపోతున్నాయని అన్నారు. అయినా ఆ రాష్ట్ర ప్రభుత్వాలు గాని కేంద్రప్రభుత్వం గాని పట్టించు కోవడం లేదని అన్నారు. ఈనేపథ్యంలో మహిళలు పోరాటాలే దిక్కని అన్నారు. దేశ ప్రజలంతా మణిపూర్ మహిళలకు అండ గా ఉండి, మహిళల రక్షణకై జరుగుతున్న పోరాటాలకు మద్దతివ్వాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు జగదాంబ, బుజ్జమ్మా, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

అమ్మకానికి మెడికల్ సీట్లు

మేనేజ్‌మెంట్ సీట్లు 50శాతం ● సామాన్యుల ఆశలపై నీళ్లు

ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో సీట్లు దొరుకుతాయని ఆశపడ్డవారికి ప్రభుత్వం భారీ షాక్ ఇచ్చింది. ప్రభుత్వ రంగంలో మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేస్తున్నామంటూ హడావుడి చేసిన ప్రభుత్వం తాజాగా ఇందులో 50శాతం సీట్లు ప్రైవేటుకు విక్రయించుకునేందుకు వీలుగా ఉత్తర్వులు మంజూరు చేయడంతో వైద్య వృత్తిలో చేరవచ్చన్న ఆశ, ఆకాంక్షతో ఎదురు చూసినవారంతా అవాక్కవుతున్నారు. తమ ఆశలపై నీళ్లు జల్లారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంపై విద్యార్థుల్లో ఆందోళన పెల్లుబుకుతోంది. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన మెడికల్ కాలేజీ ఎదుటగా శుక్రవారం ఆందోళన కూడా చేపట్టారు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాష్ట్ర వ్యాప్తంగా 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తున్నామంటూ ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్న విషయం విధితమే. వీటిలో విజయనగరం జిల్లా కేంద్రంలో తలపెట్టిన మెడికల్ కాలేజీ భవన నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయని, ఈ ఏడాది నుంచే తరగతులు కూడా నిర్వహిస్తామని ఇటీవల భోగాపురం, కురుపాం జిల్లాలకు వచ్చిన సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రకటించిన విషయం విధితమే. ఎంబిబిఎస్ మొదటి సంవత్సరానికి 150సీట్లు కూడా మంజూరయ్యాయి. జులై 15నుంచి కౌన్సిలింగ్ చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నామని, ఆగస్టులో అడ్మిషన్లు ప్రారంభమౌతాయని కూడా కళాశాల అధికారులు ప్రకటించారు. దీంతో, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడినవారెందరో వైద్యవృత్తి చదుకునేందుకు అవకాశం దొరుకుతుందని ఎంతో ఆశపడ్డారు. కానీ, కొత్త వైద్య కళాశాలల్లో 50శాతం సీట్లు విక్రయానికి పెడుతూ వైద్యారోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎంటి కృష్ణబాబు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం మన మెడికల్ కాలేజీకి కేటాయించిన 150సీట్లలో 15శాతం సీట్లను ఆలిండియా కోటాలో కేటాయిస్తారు. మిగిలిన సీట్లలో 128 లేదా 129సీట్లలో 50శాతం సీట్లు మాత్రమే ప్రభుత్వ కోటా కింద కేటాయిస్తారు. మిగిలిన 50శాతంలో 35శాతం సెల్ఫ్‌ఫైనాన్స్ కింద, 15శాతం ఎన్‌ఆర్‌ఐ కోటా కింద కేటాయిస్తారు. దీనిబట్టి ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడినవారికి 64 లేదా 65సీట్లకు మించి వచ్చే అవకాశం లేదు. సెల్ఫ్ ఫైనాన్స్ కోటా సీట్లను 12లక్షలకు, ఎన్‌ఆర్‌ఐ కోటా సీట్లకు రూ.20లక్షల చొప్పున ఫీజు విధించారు. దీంతో, వైద్య వృత్తిచేయాలని కలలు కంటున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమౌతోంది. ప్రభుత్వ రంగంలో ఏర్పాటుచేసి ప్రైవేటు కళాశాల మాదిరిగా సీట్లు అమ్ముకోవడమేమిటని ప్రశ్నిస్తున్నారు. వాస్తవానికి ఈ కళాశాల రాష్ట్ర విభజన సమయంలో అప్పటి టిడిపి ప్రభుత్వమే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. అప్పట్లో ప్రైవేటు రంగంలో ఏర్పాటు చేస్తామనడంతో సిపిఎం సహా ఇతర పార్టీలు, ప్రజాసంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ప్రభుత్వ రంగంలోనే ఏర్పాటు చేయాలని ఆందోళనలు సైతం నిర్వహించాయి. వైసిపి వచ్చాక ప్రభుత్వ రంగంలో ఏర్పాటు చేసినప్పటికీ, తిరిగి విద్యను మాత్రం ప్రైవేటుపరం చేయడంతో ప్రభుత్వం ఆశపెట్టి మోసం చేసిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మెడికల్ సీట్లు విక్రయించుకోవడానికి చూపుతున్న శ్రద్ధ కళాశాలల్లో పోస్టుల భర్తీపై లేదని కూడా పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. సాధారణంగా మొదటి సంవత్సరం ఎంబిబిఎస్ విద్యార్థులకు అనాటమీ, ఫిజియాలజీ, బయో కెమిస్ట్రీ, కమ్యూనిటీవ్ మెడిసిన్ వంటి నాలుగు విభాగాలు అవసరమౌతాయి. కళాశాల మొత్తానికి 222 మంది ప్రొఫెసర్ పోస్టులు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు సుమారు 192పోస్టులు మాత్రమే భర్తీ అయ్యాయి. భర్తీ కావాల్సిన 30పోస్టుల్లో కొన్ని రాష్ట్ర కేంద్రం, మరికొన్ని రీజనల్, ఇంకొన్ని కళాశాల స్థాయిలో భర్తీ చేయాల్సి వుంది.

పలుచోట్ల భారీ వర్షం

ప్రజాశక్తి-బొబ్బిలి, గజపతినగరం, వేపాడ

జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటల పాటు ఎడతెరిపి లేకుండా కురవడంతో పొలాలు, చెరువుల్లో భారీగా నీరు చేరింది. గజపతినగరం, బొబ్బిలి, వేపాడ, సాలూరు తదితర మండలాల్లో కురిసిన వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ పనులను ముమ్మరం చేసేందుకు సన్నద్ధమవుతున్నారు.

నాయుడుకాలనీ జలమయం

బొబ్బిలిలో కురిసిన భారీ వర్షాలకు నాయుడుకాలనీ జలమయమైంది. కాలనీలో మురుగునీటి కాలువలు లేకపోవడంతో వరదనీరు బయటకు వెళ్లకుండా నివాస ప్రాంతాల్లో నిల్వ ఉండడంతో కాలనీ చెరువును తలపిస్తుంది. ఇళ్లలోకి వరదనీరు వెళ్లడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో కొన్ని ప్రాంతాల్లో కాలువలు నిర్మించినప్పటికి మరికొన్ని ప్రాంతాల్లో నిర్మించలేదు. అధికారులు స్పందించి మురుగునీటి కాలువలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

తగాదాలు తీర్చకపోతే తాడోపేడో

- పార్టీ నాయకులకు ఎమ్మెల్సీ రఘురాజు అల్టిమేటం
- ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా సమావేశం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

నియోజకవర్గంలోని వైసిపి పార్టీ గెలుపునకు కారణమైన కార్యకర్తలు, నాయకుల సమస్యలను రెండు మూడు రోజుల్లో పరిష్కరించకపోతే అధిష్టానంతో తాడోపేడో తేల్చుకుంటానని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. తరువాత నియోజకవర్గ నాయకులు తీసుకునే నిర్ణయాల పట్ల పెద్ద నాయకులు తనపై చూపించే కోపతాపాలను సైతం భరించేందుకు సిద్ధంగా ఉన్నానని హెచ్చరించారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అనుసరిస్తున్న పద్ధతుల వల్ల తమకు అన్యాయం జరుగుతుందంటూ పట్టణంలోని ఎరుకమ్మ పేరంటాలు కళ్యాణ మండపంలో ఆ పార్టీ నాయకుడు వెంకట్రావు అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెసిఎస్ కన్వీనర్‌గా తనను, మండల పార్టీ అధ్యక్షునిగా మోపాడ కుమార్‌ను ఎన్నుకోగా ఎమ్మెల్యే జెసిఎస్ కన్వీనర్ గా తనను తొలగించి ఇప్పటికే వాకాడ రాంబాబు కుమారుడికి కట్టబెట్టారని అన్నారు. అంగన్‌వాడీ పోస్టులను ఎమ్మెల్యే అమ్ముకున్నారని ఆరోపించారు. ఎంపిపి సండి సోమేశ్వరరావు మాట్లాడుతూ. ఎమ్మెల్యే ప్రోటోకాల్ పాటించడం లేదని, తన సొంత గ్రామంలో ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహిస్తున్నా తనకు సమాచారం ఇవ్వడం లేదని అన్నారు. మోపాడ గౌరీ నాయుడు మాట్లాడుతూ. ఒక్కొక్క ఎంపిటిసి పరిధిలో ఇద్దరు మేట్లను నియమించేందుకు పేర్లు ఇవ్వమని చెప్పి తనకు తెలియకుండానే నియమించారని తెలిపారు. ఎమ్మెల్యే వైఖరి వల్ల వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే స్థానాన్ని కోల్పోయే పరిస్థితి నెలకొందని ఆయన మండిపడ్డారు.

ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ ఎమ్మెల్యే నిర్ణయాల వలన కార్యకర్తల్లో ఐక్యత లోపిస్తుందని అన్నారు. ఎమ్మెల్యేపై అసంతృప్తితో కార్యకర్తలు సమావేశమవుతున్నారన్న తెలుసుకున్న మంత్రి బొత్స సత్యనారాయణ తనకు ఫోన్ చేసి ఎట్టి పరిస్థితుల్లోనూ అటువంటి సమావేశాలు జరగకూడదని, రెండు మూడు రోజుల్లో సమస్యను పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారని అన్నారు. సమస్యలు తీర్చకపోతే నేనే రంగంలోకి తానే దిగుతానని రఘురాజు అన్నారు. జెడ్‌పిటిసి వెంకటలక్ష్మి, పలువురు ఎంపిటీసీలు, సర్పంచులు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తోనే తమ ప్రయాణమని చెప్పారు. అవసరమైతే రాజీనామాలు చేస్తామని, బస్సుల్లో అమరావతి వెళ్లి ముఖ్యమంత్రిని కలుస్తామని అన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ

వెట్టిచాకిరీ చేయించి.. వివక్ష చూపుతారా?

- అధికారుల తీరుపై సిఐటియు నేత తమ్మినేని ఆగ్రహం
- పంచాయతీ కార్మికుల సమ్మెకు సంఘీభావం

ప్రజాశక్తి-రామభద్రపురం

పంచాయతీ కార్మికులతో వెట్టిచాకిరీ చేయించుకుంటూ వేతనాల్లో వివక్షత చూపించడమేమిటని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. రామభద్రపురంలో పంచాయతీ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారం 18వ రోజుకు చేరింది. కార్మికుల దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి, సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 18 రోజులుగా సమ్మె చేస్తున్న నేటికీ అధికార యంత్రాంగం వీరి సమస్యల పరిష్కారానికి చొరవ చూపక పోవడం దారుణమన్నారు. సమాన పనికి సమాన వేతనాలు చెల్లించడం లేదన్నారు. కనీసం రూ.10 వేలు జీతం ఇస్తూ, సమగ్ర బీమా, రక్షణ పరికరాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఎల్‌పిఒతో మాట్లాడి కార్మికుల సమస్యకు పరిష్కారం త్వరగా పరిష్కారం చూపి దీక్ష విరమించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బలస శ్రీను, కార్మికులు భవానీ, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబం ఓట్లన్నీ ఒకే పోలింగ్ స్టేషన్‌లోనే

స్వచ్ఛమైన ఓటర్ల జాబితాలను రూపొందించాలి ● వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నాగలక్ష్మి

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన ఓటర్ల జాబితాలను రూపొందించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. ఒక కుటుంబం ఓట్లన్నీ ఒకే పోలింగ్ స్టేషన్‌లో ఉండేలా చూడాలని ఆదేశించారు. జిల్లాలో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంపై మండలాల వారీగా, తాహశీల్దార్లు, డిటిలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం సమీక్షించారు. బిఎల్‌ఒల ఇంటింటి సర్వే జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైన సందర్భంగా, దీనికి సంబంధించి కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఓటర్ల జాబితా తయారీలో నిర్లిప్తతను, నిర్లక్ష్యాన్ని విడనాడాలని, ఒక్క తప్పు కూడా దొర్లకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ, వాటికి అనుగుణంగా జాబితాలను రూపొందించాలన్నారు. చిన్న తప్పుకు కూడా పెద్ద శిక్ష పడే అవకాశం ఉందని హెచ్చరించారు. బిఎల్‌ఒల నుంచి ఇఆర్‌ఒలు దాకా అన్ని స్థాయిల్లో అప్రమత్తంగా ఉండి, ఖచ్చితమైన వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. ఎఇఆర్‌ఒలు, ఇఆర్‌ఒలు కూడా తరచుగా క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ఇంటింటి సర్వే అనంతరం, ఏ రోజుకారోజు సమాచారాన్ని నమోదు చేయాలన్నారు. బిఎల్‌ఓలు తమ వెంట, రాజకీయ పార్టీలు అధికారికంగా నియమించిన బూత్ లెవెల్ ఏజెంట్లను మాత్రమే తీసుకువెళ్లాలని స్పష్టం చేశారు. ఇంటింటికీ వెళ్లినప్పుడు తమ వెంట 6,7,8 ఫారాలు తీసుకువెళ్లి, అవసరమైనవారి చేత దరఖాస్తు చేయించాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఖచ్చితమైన వివరాలు, ఇంటినెంబర్లతో స్వచ్ఛమైన జాబితాలు తయారు చేయాలన్నారు. ఓటర్లు కోరితే పాత ఫొటోల స్థానంలో తాజా ఫొటోలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఒక ఇంటి ఓటర్లు, ఒక కుటుంబం ఓటర్లు, వీలైతే ఒక ప్రాంతం ఓటర్లు ఒకే పోలింగ్ స్టేషన్లో ఉండేలా చూడాలని కలెక్టర్ కోరారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డిఆర్‌ఒ ఎం.గణపతిరావు, ఇఆర్‌ఒలు, ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్ రోడ్డును పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

పైడితల్లమ్మ జాతర నాటికి

అంబేద్కర్ జంక్షన్ రోడ్డు పూర్తి

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రానున్న పైడితల్లమ్మ జాతర సమయానికల్లా మయూరి జంక్షన్‌నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకు ఉన్న రహదారి పనులు పూర్తి చేయాలని అధికారులకు డిప్యూటీ స్పీకర్ కొలగట్ల వీరభద్రస్వామి ఆదేశించారు. శుక్రవారం ట్యాంక్ బండ్‌రోడ్‌ను పరిశీలించారు. రహదారి నిర్మాణ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రోడ్డు విస్తరణతో పాటు కొత్తగా డివైడర్లు, సెంటర్ లైటింగ్ ఏర్పాటుపై అధికారులతో చర్చించారు. ఈ మార్గంలో ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రహదారి వెడల్పునకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆర్.శ్రీరాములు నాయుడు మాట్లాడుతూ వివిధ శాఖల సమన్వయంతో రహదారి విస్తరణ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేస్తామని చెప్పారు. విద్యుత్‌శాఖ ఇఇ కృష్ణమూర్తి మాట్లాడుతూ ముందుగా విద్యుత్ స్తంభాలను మార్పు చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిఇ శ్రీనివాసరావు, వైసిపి నాయకులు బొద్దాన అప్పారావు, రెడ్డి గురుమూర్తి, జివి రంగారావు, భోగాపురపు రవిచంద్ర, బాలి ప్రతాప్, నగరపాలక సంస్థ ఇఇ కె.శ్రీనివాసరావు, ఎసిపి అమ్మాజీ రావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నగరంలోని 35 వ డివిజన్ విటి అగ్రహారంలో వివిధ అభివద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి శంకుస్థాపన చేశారు. రూ.26.10 లక్షలతో ఏర్పాటు చేయనున్న రహదారులు కాలువ పనులను ప్రారంభించారు. మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ముచ్చులయా యాదవ్, కార్పొరేటర్ చందక శ్రీనివాసరావు, జోనల్ ఇన్చార్జిలు బి.అప్పారావు, మారం బాల బ్రహ్మారెడ్డి, వైసిపి నాయకులు తాత్రాజు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్య వ్యాపారం సిగ్గుచేటు

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద ఎస్ఎఫ్ఐ ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం వైద్య విద్య సీట్ల భర్తీలో విద్య వ్యాపారానికి తివాచి పరిచి బలహీన వర్గాల విద్యార్థులను వైద్య విద్యకు దూరం చేస్తున్నదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రామ్మోహన్ అన్నారు. వైద్య విద్య సీట్ల భర్తీ విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా శుక్రవారం విద్యార్థులు జిల్లా సర్వజన ఆస్పత్రి వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేసి ఐదు వైద్య కళాశాలలను ఈ ఏడాది నుంచి ప్రారంభిస్తామని ఆర్భాటంగా ప్రకటించుకుని నేడు ఆ కళాశాలలను వ్యాపార కేంద్రాలుగా మారుస్తోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొని వచ్చిన 107,108 జీవోల ద్వారా ఈ విషయం తేటతెల్లమవుతుందని తెలిపారు. మూడు కేటగిరీలుగా సీట్లు భర్తీ చేసి వాటిలో 50శాతం సీట్లను సెల్ఫ్ ఫైనాన్స్ ఎన్ఆర్ఐకు కేటాయించడంతో ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ విద్యార్థులకు ద్రోహం చేస్తున్నారని చెప్పారు. తెలంగాణలో నూతన కళాశాలలో ప్రారంభిస్తున్న మొత్తం కన్వీనర్ కోటలోనే సీట్లు భర్తీ చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్రంలో విద్యలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తున్నా రంటే బలహీన వర్గాల ప్రజలకు విద్యకు దూరం చేయడమేనని అన్నారు. వెంటనే ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకొని పేద విద్యార్థులకు వైద్య విద్య కృషి చేయాలని, లేని పక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు డి.రాము, జిల్లా కమిటీ సభ్యులు రమేష్, లావణ్య, హరికృష్ణ తడుతరులు పాల్గొన్నారు.

సర్వజన ఆస్పత్రి వద్ద ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

పూసపాటిరేగ : విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు కోట జగదీష్ మాట్లాడుతూ స్థానిక బ్రిడ్జి జంక్షన్ వద్ద ఫుట్‌పాత్ సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కి వినతి పత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుల అర్జున్, విద్యార్థులు ఆదిల్, హేమంత్ పాల్గొన్నారు.

కొత్తవలస : ప్రభుత్వ జూనియర్ కాలేజీకి కొత్త భవనం మంజూరు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వి.చినబాబు ఆధ్వర్యాన తహశీల్దార్‌కు శుక్రవారం వినతి అందించారు. ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని, మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నాయుడు, వర్ధన్, చైతన్య హర్ష పాల్గొన్నారు.

జామి : జామిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని భీమసింగి జంక్షన్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు మానవహారం చేపట్టారు. జామి సెంటర్‌లో విద్యార్థులకు అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వి.చిన్నబాబు కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు హర్ష, రవి పాల్గొన్నారు.

జామి.. భీమసింగి జంక్షన్‌లో మానవహారం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

ఎరువులు అందుబాటులో ఉంచాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో ఖరీఫ్ పనులు ప్రారంభమైనందున ఎరువులను అందుబాటులో ఉంచాలని కలెక్టర్‌ను ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు కోరారు. మేరకు కలెక్టర్‌కు లేఖ రాశారు. పంటల సాగు నేపథ్యంలో దుక్కులోను, మొక్కదశలోనే ఎరువవులు వేయాల్సి ఉందని, అయినా ఆర్‌బికెల్లో అందుబాటులో లేవని తెలిపారు. వెంటనే జోక్యం చేసుకుని అన్ని అర్ బి కె లో అన్ని రకాల ఎరువులను అందుబాటులో ఉంచాలని కోరారు.

అండమాన్ మత్స్యశాఖ డైరెక్టర్‌తో భేటీ

ప్రజాశక్తి-విజయనగరం

అండమాన్‌లో మత్స్యకారులకు అక్కడి ప్రభుత్వం అందించే ప్రభుత్వ పథకాలను అధ్యయనం చేసేందుకు రాష్ట్రం నుంచి మత్స్యకార సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు వెళ్లారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులైన ఆఫ్కాఫ్ అధ్యక్షులు అనిల్ బాబు, ఫిష్ కోఫెడ్ డైరెక్టర్ బర్రి చిన్నప్పన్న తదితరులు అండమాన్ మత్స్య శాఖ డైరెక్టర్ విక్రమ్ సింగ్‌ను కలిశారు. మత్స్యకారులకు అక్కడి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, వసతులు మత్స్యశాఖ అభివృద్ధి తీసుకుంటున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. మన రాష్ట్రంలో మత్స్యకారులకు ప్రభుత్వ అందించే సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి వివరించారు.

నేతన్న నేస్తం నిధులు విడుదల

ప్రజాశక్తి- విజయనగరం

ఐదో విడత వైఎస్ఆర్ నేతన్న నేస్తంను రాష్ట్ర వ్యాప్తంగా 80,686 మంది నేతన్నలకు రూ.193.64 కోట్లను తిరుపతి వెంకటగిరి సభ నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, చేనేత, జౌళి శాఖ ఎడి మురళీ కృష్ణ, నేతన్న నేస్తం లబ్ధిదారులు వీక్షించారు. జిల్లా వ్యాప్తంగా 754 మంది చేనేత కార్మికులకు ఒక్కొక్కరికి 24 వేల రూపాయలు చొప్పున రూ.1,80,96,000 లబ్ధిదారుల ఖాతాలకు జమ చేశారు. అందుకు సంబంధించిన మెగా చెక్కును జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఎడి మురళీ కృష్ణ, పద్మశాలీ సంఘం డైరెక్టర్ లలిత కుమారి తదితరులు లబ్దిదారులకు అందజేశారు.

ఉద్యోగుల గ్రీవెన్స్‌కు 84 దరఖాస్తులు

ప్రజాశక్తి-విజయనగరం

ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం నిర్వహించిన ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్ కు 84 దరఖాస్తులు అందాయి. వీటిలో కొన్ని వ్యక్తిగత , ఆర్థిక అంశాలకు సంబంధించినవి కాగా కొన్ని యూనియన్ ల ద్వారా పలు అంశాల పై దరఖాస్తులు అందాయి. నాల్గవ తరగతి ఉద్యోగ సంఘం నాయకులు మువ్వల గంగాప్రసాద్ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, ఒపిఎస్ అమలు చేయాలని కోరారు. పెండింగ్ డిఎలు, సరెండర్ లీవ్ లు మంజూరు చేయాలని, ఉద్యోగుల హెల్త్ కార్డ్‌లపై క్యాష్ లెస్ వైద్యం అందేలా చూడాలని, ఖాళీగా ఉన్న నాల్గవతరగతి ఉద్యోగుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఆర్‌టిసి లో ఇంక్రిమెంట్లు ఇవ్వాలని కోరుతూ పలువురు దరఖాస్తులు చేశారు. వినతులను సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్ స్వీకరించారు. ఈ వినతులను సంబంధిత శాఖా ధికారులకు, ప్రభుత్వానికి పంపించి తగు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా జెసి తెలిపారు.

ముగిసిన విఆర్ఎల దీక్షలు

కొత్తవలస... దీక్షలో పాల్గొన్న విఆర్ఎలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి గ్రామ రెవెన్యూ సహాయకులు సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయాల వద్ద విఆర్ఎలు చేపట్టిన రెండు రోజుల రిలే నిరాహారదీక్షలు శుక్రవారం ముగిసాయి. ముఖ్యమంత్రి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలని, యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.గురుమూర్తి, మండల కార్యదర్శి గోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ధరల్లో రూ.10,500 జీతంతో ఎలా బతకాలని ప్రశ్నించారు. నామిని విఆర్ఎలను రెగ్యులర్ విఆర్ఎలుగా గుర్తించాలని, జీతం రూ.21 వేలు ఇవ్వాలని కోరారు. ఈ నేపథ్యంలో పోరాటానికి సన్నద్ధమయ్యామని, అందులో భాగంగా ఆగస్టు 7, 8 తేదీల్లో కలెక్టరేట్ వద్ద, ఆగస్టు 25 న విజయవాడలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని తెలిపారు. వీరికి సిఐటియు నగర కార్యదర్శి బి.రమణ, ఉపాధ్యక్షులు త్రినాథ్ మద్దతు ప్రకటించారు. రిలే నిరాహార దీక్షలో సన్యాసప్పుడు, రాములప్పుడు, పెంటయ్య, గౌరీ, అప్పారావు, వీరస్వామి, జై పాలు, ఆదినారాయణ, బంగారయ్య, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

పూసపాటిరేగ : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్ఎల సంఘం గౌరవాధ్యక్షులు బచ్చల సూర్యనారాయణ ఆధ్వర్యాన విఆర్ఎలు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షులు భద్ర, సూరప్పన్న, శ్రీను పాల్గొన్నారు.

లక్కవరపుకోట : విఆర్ఎల సమస్యలపై సిఐటియు ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్ష శుక్రవారం రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు గాడి అప్పారావు మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు తరిణి వెంకటరమణ, విఆర్ఎలు కాటపల్లి రాంబాబు, తలారి మహేష్, రామచంద్రుడు, గొల్ల అర్జున, మునురి దేముడు తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస : తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్ఎల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు చుక్క సూరిబాబు, దెందేటి మహేష్ ఆధ్వర్యంలో రెండో రోజు దీక్షలు కొనసాగించారు. దీక్షలకు సిఐటియు నాయకులు గాడి అప్పారావు మద్దతు ప్రకటించారు.

డెంకాడ : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్ఎలు చేపట్టిన రిలే నిరాహార దీక్ష రెండురోజు శుక్రవారం ముగిసింది. కార్యక్రమంలో విఆర్ఎల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శి గురువులు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

వంగర : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్ఎలు చేపట్టిన రిలే నిరాహార దీక్షకు సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ రామ్మూర్తి నాయుడు మద్దతు తెలిపారు.



బొండపల్లి.. ధర్నా చేస్తున్న విఆర్ఎలు, సిఐటియు నాయకులు

కార్యక్రమంలో విఆర్ఎల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసరావు, గురుమూర్తి పాల్గొన్నారు.

శృంగవరపుకోట : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్ఎలు చేపట్టిన రిలే నిరాహార దీక్ష శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడారు. విఆర్ఎల సంఘం మండల అధ్యక్షులు తెరపల్లి అప్పారావు, నరవ దేవుడమ్మ, గెడ్డపు మురళి, అప్పారావు, అలమండ దేవుడమ్మ, పాల్గొన్నారు.

గజపతినగరం : గజపతినగరం, బొండపల్లి తహశీల్దార్ కార్యాలయాల వద్ద విఆర్ఎలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి మాట్లాడారు. అనంతరం తహశీల్దార్లకు వినతులు అందజేశారు.

28కి లక్షింపేట కేసు వాయిదా

ప్రజాశక్తి-వంగర

మండలంలోని లక్షింపేట కేసును శ్రీకాకుళం కోర్టు జడ్జి ఎస్ఎం ఫణికుమార్ ఈనెల 28వ తేదికి వాయిదా వేశారు. ఈ మేరకు ఆయన లక్షింపేట ప్రత్యేక కోర్టులో శుక్రవారం విచారణ చేపట్టారు. 80 మంది నిందితులకు గాను, 67 మంది హాజరు కాగా, ఒకరు గైర్హాజరయ్యారు. మిగతా 12 మంది మృతి చెందారు. రాజాం రూరల్ సిఐ హెచ్.ఉపేంద్రరావు, వంగర ఎస్ఐ ఆర్.జనార్ధనరావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. 2012 జూన్ 12న లక్షింపేట ఘటన జరిగిన తరువాత గ్రామంలో ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇంతవరకు కూడా సుమారుగా 30, 40 రోజుల వ్యవధిలో వాయిదాలుండేవి. ఈసారి మాత్రం వారం రోజుల వ్యవధిలో వాయిదా వేయడం గమనార్హం. దీంతో కేసు వేగవంతం చేస్తున్నట్లు ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

చిరుధాన్యాల పంటల పరిశీలన

ప్రజాశక్తి-కొత్తవలస

మండలంలోని గనిశెట్టిపాలెంలో సబల సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న చిరుధాన్యాల పంటలను రీజినల్ టెక్నికల్ ఆఫీసర్ హేమసుందర్ శుక్రవారం పరిశీలించారు. ఏక పంటల విధానం కాకుండా బహుళ పంటలు వేసుకుంటే రైతులకు మంచి లాభదాయకమని ఆయన తెలిపారు. బహుళ పంటల విధానం వల్ల భూమికి సారవంతమై భూమికి పోషక పదార్థాలు అందుతాయని చెప్పారు. భూమి లోపల జీవ వైవిధ్యం ఏర్పడుతుందని అన్నారు.

విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న క్లస్టర్ కార్యకర్త గురుమూర్తి

విత్తనశుద్ధితో రైతులకు మేలు

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని నాతవలస గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో విత్తన శుద్ధిపై క్లస్టర్ కార్యకర్త పి.వి.గురుమూర్తి అవగాహన కల్పించారు. బీజామృతంతో విత్తనశుద్ధి చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు.

టెన్నిస్ టోర్నీలో రామ్‌నాయన ప్రతిభ

ప్రజాశక్తి-బొబ్బిలి

భిలాయ్‌లో ఈ నెల 15 నుంచి 20 వరకు జరిగిన టెన్నిస్ టోర్నీలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన సోదరుడు రామ్‌నాయన ప్రతిభ కనబరిచారు. భిలాయ్‌లో ఆలిండియా టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరల్డ్ టెన్నిస్ మాస్టర్స్ ఎంటి 200 పోటీలు జరిగాయి. 50 ఏళ్ల పైబడి కేటగిరీలో సింగిల్స్ అండ్ డబుల్స్ విభాగాల్లో రామ్‌నాయన ప్రథమ స్థానంలో నిలిచారు. టెన్నిస్ టోర్నీలో ప్రతిభ కనబరిచిన రామ్‌నాయనను పలువురు అభినందించారు.

సాధించిన పతకాలతో రామ్‌నాయన

నాడు-నేడు పనులు వేగవంతం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు పనులు, గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా హౌసింగ్ ప్రత్యేకాధికారి వి.శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులు యుద్ధ ప్రాతిపాదికన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జి.గిరిబాల, ఇఒపిఆర్‌డి హెచ్.భానోజీరావు, తదితరులు పాల్గొన్నారు.

'మేఘ' ఫస్ట్ లుక్ విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మనాయుడు

'మేఘ' ఫస్ట్ లుక్ విడుదల

ప్రజాశక్తి-బాడంగి

మేఘ షార్ట్‌ఫిల్మ్ ఫస్ట్ లుక్‌ను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముగడ గ్రామానికి చెందిన షార్ట్‌ఫిల్మ్ తీయడం శుభసూచికమన్నారు. నైపుణ్యం ఉన్న యువత అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు తెంటు రవిబాబు, ఎస్‌టి సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పాలవలస గౌరు, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఓటర్ల సర్వే

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో ఇంటింటి ఓటర్ల సర్వే శుక్రవారం ప్రారంభమైంది. పంచాయతీ కార్యదర్శులు, బిఎల్ఒలు ఇంటింటికీ వెళ్లి కొత్త ఓటర్ల నమోదు చేపట్టారు. అర్హులైన వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ ప్రసన్నకుమార్ కోరారు.

కలెక్టర్‌ను కలిసిన జాప్ ప్రతినిధులు

ప్రజాశక్తి-విజయనగరం

జర్నలిస్టు అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ (జాప్) జిల్లా నూతన కార్యవర్గం నియామకమైన సందర్భంగా శుక్రవారం యూనియన్ ప్రతినిధులు కలెక్టర్ నాగలక్ష్మిని, సమాచార పౌర సంబంధాలశాఖ ఎడి డి.రమేష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన కమిటీకి కలెక్టర్, ఎడి శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిస్టులు సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. యూనియన్ మరింత బలోపేతమై సమాజానికి మంచి చేసే దిశగా అడుగులు వెయ్యాలని అకాక్షించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు అవనపు సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు మానాపురం రవిచంద్ర శేఖర్, ప్రధాన కార్యదర్శి దినపల్లి పరుశురాం, కోశాధికారి వై.సి.హెచ్.ఆదినారాయణ, కార్యనిర్వాహక కార్యదర్శులు వి.గౌరి శంకర్, ఎం.హేమంత్ కుమార్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జనార్దన్ థాట్రాజ్‌కు నివాళి

ప్రజాశక్తి- గుమ్మలక్ష్మీపురం

మాజీ ఎమ్మెల్యే విటి జనార్దన్ థాట్రాజ్ విగ్రహానికి కురుపాం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి నివాళ్లు అర్పించారు. జియమ్మవలస మండలం అల్లువాడ సమీపంలో ఏర్పాటు చేసిన థాట్రాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఎమ్మెల్యేగా ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అరకు పార్లమెంట్ టిడిపి అధికార ప్రతినిధి దొంకాడ రామకృష్ణ, నాయకులు వైరిచర్ల వీరేశ్ చంద్రదేవ్, పల్ల రాంబాబు, గురాన శ్రీరామ్మూర్తి నాయుడు, నందివాడ కృష్ణబాబు తదితరులు ఉన్నారు.

విజయనగరంలో ధర్నా, నెల్లిమర్లలో దీక్షలు చేస్తున్న మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న ఇంజినీరింగ్, వాటర్ వర్క్స్, విలీన ప్రాంత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జగన్మోహన్ డిమాండ్ చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద శుక్రవారం కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 30ను సవరించి వేతనాలు ఇవ్వాలని, ఇఎస్ఐ కార్డులు మంజూరు చేయాలని, నగరం విస్తరణకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని, ఎఫ్ ఆర్ ఎస్ నుంచి మినహాయించాలని డిమాండ్ చేశారు. ఒకే రకమైన శాశ్వత స్వభావం కలిగిన వారందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని కోరారు. సిఎం ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కోరారు. అందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా జులై 27న మున్సిపల్ ఆఫీసుల వద్ద, ఆగస్టు 7న కలెక్టరేట్ వద్ద జరిగే ఆందోళనలో మున్సిపల్ రంగంలో పనిచేస్తున్న అన్ని రకాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ కార్మికులు రామనాయుడు, రాజు, మున్సిపల్ కార్మికులు రమా, కుమారి, రాఘవ, సూరి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : నగర పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి యుఎస్ రవికుమార్ డిమాండ్ చేశారు. ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం కార్మికులు నిరసన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. హెల్త్ ఆలవెన్స్ బకాయిలు వెంటనే చెల్లించి, ఇంజినీరింగ్, వాటర్ వర్క్స్ కార్మికులకు జిఒ నంబర్ 7 ప్రకారం వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 27న నగర పంచాయతీ కార్యాలయ ముట్టడి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు, నాయకులు టి.బాబూరావు, ఎం.దుర్గారావు, బి.శ్రీనివాసరావు, లక్ష్మి, హరి తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై అత్యాచారం దుర్మార్గం

ప్రజాశక్తి-బొబ్బిలి

మణిపూర్‌లో మహిళలపై సామూహిక అత్యాచారం చేయడం దుర్మార్గమని పట్టణ కళాసీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బి.అప్పలస్వామి, డి.వర్మ, కమిటీ సభ్యులు వై.అప్పారావు, ఎస్.అప్పారావు ఖండించారు. కళాసీ సంఘం కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ మణిపూర్‌లో అల్లర్లు జరిగి మహిళలపై దాడులు, అత్యాచారాలు జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. తక్షణమే కేంద్రం జోక్యం చేసుకుని అల్లర్లు నివారించాలని, మహిళలపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

కళాశాల స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

కోమటిపల్లి వద్ద ఉన్న గురుకులాన్ని కళాశాల స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని ప్రిన్సిపల్ పురుషోది, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు... ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడును కోరారు. వైసిపి కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే శంబంగికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాల స్థాయికి పాఠశాలను అప్ గ్రేడ్ చేస్తే పేద విద్యార్థులకు న్యాయం జరుగుతుందని చెప్పారు. దీనికి ఎమ్మెల్యే శంబంగి సానుకూలంగా స్పందించారు.

ఇంటింటా ఓటర్ల తనిఖీ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

కోరాడపేటలో టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి గేదెల రాజారావు ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటికి వెళ్లి ఓటర్ల తనిఖీ నిర్వహించారు. కొత్త ఓట్ల నమోదు, చనిపోయిన వారిని తొలగించడం, డోర్ నంబర్ తేడా ఉన్నవి సరి చేయడం వంటి చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు తాడ్డి సత్య నారాయణ, తెలుగు యువత మండల అధ్యక్షులు నల్లం శ్రీనివాసరావు, మాజీ ఎంపిటిసి కోరాడ అప్పలనాయుడు, కోరాడ రామారావు, కొండపల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రజలకు న్యాయం

బొబ్బిలిలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు

ప్రజాశక్తి-బొబ్బిలి

జగనన్న సురక్షతో ప్రజలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ అన్నారు. మున్సిపాలిటీలో కళాభారతి ఆడిటోరియంలో, గొల్లపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. సంక్షేమ పథకాలు అందని అర్హులను గుర్తించి, అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని కొండగంగుపూడి సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మాట్లాడుతూ సురక్ష కార్యక్రమంలో సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందేలా గ్రామ వాలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లు విశేషంగా కృషి చేయాలన్నారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఎస్.అప్పలనాయుడు, సర్పంచ్ గాలారి బంగారయ్య, ఎంపిటిసి డి.ముత్యాలమ్మ, తహశీల్దార్ ప్రసన్నకుమార్, వైసిపి మండల అధ్యక్షుడు జగన్నాథం, బిసి సెల్ జిల్లా సమన్వయకర్త సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి పద్మావతి పాల్గొన్నారు.



వేపాడలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటం

ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యులు పావని



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యులు పావని

ప్రజాశక్తి-నెల్లిమర్ల

విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ నిరంతర పోరాటం చేస్తుందని ఆ సంఘం కేంద్ర కమిటీ సభ్యులు సిహెచ్ పావని, జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకటేష్ తెలిపారు. శుక్రవారం స్థానిక సికెఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సెమినార్ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంతవరకు అమ్మఒడి నిధులు పూర్తి స్థాయిలో ఇవ్వలేని ప్రభుత్వం విద్యా రంగం అభివృద్ధిపై మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పుస్తకాలు ఇంతవరకు అందలేదన్నారు. కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. డిగ్రీలో తీసుకొచ్చిన మేజర్, మైనర్ కోర్సులను రద్దు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టే సైకిల్ యాత్రని జయప్రదం చేయాలని కోరారు. సెమినార్‌లో జిల్లా సహాయ కార్యదర్శి జె.రవికుమార్, జిల్లా కమిటీ సభ్యులు అర్జున్ పాల్గొన్నారు.

రోడ్డు లేక అవస్థలు

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

మండలంలోని మెట్టవలస గ్రామం మీసాలవీధిలో రోడ్డు లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 30 సంవత్సరాల క్రితం వేసిన రోడ్డు పాడైపోయింది. దీనివల్ల వర్షాలు కురిసినప్పుడు మురుగునీరు రోడ్డుపైకి వస్తోంది. వెంటనే అధికారులు స్పందించి రోడ్డు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

పాడై పోయిన రోడ్డు

ఇ- పంట నమోదుపై అవగాహన

ప్రజాశక్తి-విజయనగరం

ఇ-పంట నమోదుపై శుక్రవారం జిల్లా రిసోర్సు సెంటర్‌లో సహాయ వ్యవసాయ సంచాలకులకు, మండల వ్యవసాయ అధికారులకు, సాంకేతిక సహాయకులకు వ్యవసాయశాఖ ఆధ్వర్యాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఇ- పంటలో నియమావళితోపాటు పాటించాల్సిన పద్ధతులను వివరించారు. సర్వే నంబర్ లోని జియో కోఆర్డినేట్స్ ద్వారా ఫోటోను తప్పనిసరిగా యాప్ లో జతపరచవలసి ఉందని, బహువార్షిక పంటలకు గత ఏడాది నమోదు చేసిన వివరాలను, ఇ-పంటలో వాటి సమాచారాన్ని యథా విధిగా ఫార్వర్డ్ చేస్తే సరిపోతుందని జిల్లా వ్యవసాయ అధికారి విటి రామారావు, ఎడిఎలు అన్నపూర్ణ ,భారతి, ఆనంద్ రావు అన్నారు. కౌలు కార్డుల జారీని లక్ష్యాన్ని ఈ నెలాఖరు లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కౌలు కార్డులు తీసుకున్న రైతులతో జాయింట్ లయబిలిటీ గ్రూపులను తయారుచేసి వివరాలను సంబంధిత బ్యాంకులకు అందజేయాలని ఆదేశించారు. పొలంబడి యాప్‌ద్వారా పొలంబడి కార్యక్రమాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. గ్రామీణ విత్తనోత్పత్తి పథకం ద్వారా లబ్ధి పొందిన రైతులను సీడ్ నెట్ పోర్టల్లో నమోదు చేయాలన్నారు. జిల్లా వనరుల కేంద్రం ద్వారా గ్రామా రైతులకు వివిధ దశల్లో శిక్షణ ఇవ్వాలన్నారు. పంటల సాగులో వివిధ దశలలో శాస్త్రవేత్తల సూచనలు సలహాలు తీసుకోవాలని ఆదేశించారు.

విజేతలతో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.కె.మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి తదితరులు

క్రీడలతో ఒత్తిడి దూరం

సెంచూరియన్ విసి పి.కె.మహంతి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పి.కె.మహంతి అన్నారు. ఇటీవల క్యాంపస్‌లో నిర్వహించిన సెంచూరియన్ లీగ్ ఓపెన్ టోర్నమెంట్-2023 విజేతలకు శుక్రవారం బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.కె.మహంతి మాట్లాడుతూ యువత వివిధ రకాల నైపుణ్య శిక్షణలు పొందడం ద్వారా సులువుగా ఉపాధి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ఎస్.వర్మ, ఐక్యూఎసి డీన్ పిఎస్‌వి రమణారావు, డీన్లు ఎం.ఎల్.ఎన్. ఆచార్యులు, సన్నీడియోల్, మురళీ, స్పోర్ట్స్ అసిస్టెంట్ డైరెక్టర్ డి.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లు అంకితభావంతో పనిచేయాలి

ప్రజాశక్తి-బాడంగి

సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు అంకితభావంతో పనిచేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు సూచించారు. అర్హతే ప్రామాణికంగా పార్టీ, మతం, కులం, ప్రాంతాలకు అతీతంగా పథకాలు మంజూరయ్యేలా చూడాలన్నారు. మండలంలోని పాల్తేరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరాతీశారు. స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అధికారులు చిన్నపాటి లోపాలున్నా వాటిని తక్షణం సరిదిద్ది అర్హులైన పేద ప్రజలకు పథకాలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి రామారావు, ఎంపిటిసి దివ్య, ట్రైకార్ డైరెక్టర్ పారాది చిన్నపు దొర, వైసిపి నాయకులు శంబంగి వేణుగోపాల్, మరిపి శంకర్‌రావు, ఉడమాల అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే